క్లుప్తంగా

సీఎం సహాయనిధికి రూ.2.51 లక్షల సాయం



తెనాలి: భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), తెనాలి శాఖ రూ.2.51 లక్షలను సీఎం సహాయనిధికి అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జె.విజయలక్ష్మి, డాక్టర్ వి.పావనీ ప్రియాంక సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి చెక్కును అందించారు. ఐఎంఏలోని ఇతర బాధ్యులు డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ కె.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో రోడ్డును నిర్మించండి



తెనాలిఅర్బన్: సుల్తానాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ రోడ్డు అధ్వాన్నంగా ఉందని, దానిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. డాంగేవారి వీధిలో ఓ రోడ్డుకు పేరును పెట్టాలని, సుల్తానాబాద్‌లో అపార్ట్‌మెంట్ చుట్టు ఉన్న పొలాల్లో నీరు నిలిచి ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని, వాటిని పరిష్కరించాలని పలువురు కోరుతూ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.మహాలక్ష్మీపతి రావుకు వినతిపత్రాలు ఇచ్చారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ డిపోకు 100 ఫస్ట్ ఎయిడ్ కిట్స్ వితరణ



తెనాలిఅర్బన్: శ్రీ సాయిమంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో తెనాలి ఆర్టీసీ డిపోలోని బస్సులో ఏర్పాటు చేసేందుకు అవసరమైన 100 ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను సోమవారం డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రయాణంలో ఏదైనా చిన్న ప్రమాదం జరిగితే ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. త్వరలో పది కొత్త బస్సులు రానున్నట్లు చెప్పారు. అనంతరం దాత రమేష్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.జె.ప్రసాదరావు, అసిస్టెంట్ మెకానిక్ ఇంజనీర్ ఎస్ఏ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు, పలువురు అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో మహాయాగం



తెనాలి: పట్టణంలోని శ్రీలక్ష్మీపద్మావతిసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మహాయాగం నిర్వహించారు. తిరుమల లడ్డు వివాదంపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఈ యాగాన్ని నిర్వహించారు. దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో మహాయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంత్రితో పాటు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు, ఆలయ ఈవో అనుపమ, అర్చకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎవరో ఈ మృతుడు?



తెనాలిరూరల్: గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. స్థానిక పాండురంగపేటలోని పద్మావతి కళ్యాణ మండపం బజారులో సుమారు 30 నుండి 35 ఏళ్ల లోపు వ్యక్తి రోడ్డు వెంబడి మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడు కాషాయం, నీలం రంగు చారల టీషర్టు, నీలం, సిమెంటు రంగు డిజైను లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ ప్రకాశరావు(7013099095), సీఐ రమేష్‌బాబు (9440796274)లకు సమాచారమివ్వాలని కోరారు.

నేడు 'పొలం పిలుస్తుంది'

తెనాలి: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం నిర్వహించే 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని మంగళవారం రూరల్ మండలంలో ఏర్పాటుచేసినట్టు వ్యవసాయ అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 8 గంటలకు కొలకలూరు–1, మధ్యాహ్నం 2.30 గంటలకు గుడివాడలో జరుగుతుందని వివరించారు.

అనారోగ్య విభాగం

- మున్సిపల్ వార్డులలో కొరవడుతున్న పర్యవేక్షణ
- మంజూరుకాని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు
- ఇన్‌చార్జిలుగా వ్యవహరించేందుకు వెనకడుగు వేస్తున్న ఇన్‌స్పెక్టర్‌లు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ వాసులు



చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని ఆరోగ్య విభాగం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. శానిటేషన్ డివిజన్‌లలో తగినంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు లేకపోవటం... ఉన్న వారు పెద్ద డివిజన్‌లలో, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు నివశించే ప్రాంతాలలో పనిచేసేందుకు వెనకడుగు వేస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ కత్తిమీద సాములా తయారైంది. చేసేది లేక స్థానిక అధికారులు హెల్త్ అసిస్టెంట్‌లకు వీటి బాధ్యతలు అప్పగించి 'మమ' అనిపిస్తున్నారు.

తెనాలి పట్టణంలో 1.60 లక్షలకు పైగా జనాభా నివశిస్తున్నారు. దీనిని 40 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. పారిశుద్ధ్య నిర్వహణ సౌలభ్యం కోసం గతంలోని అధికారులు 9 శానిటేషన్ డివిజన్‌లుగా ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు అప్పగించారు. పర్మినెంట్ కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణ చేసేవారు. కాలక్రమేణ పర్మినెంట్ కార్మికులు పదవీ విరమణ చేస్తుండటం, వారి సంఖ్య తగ్గుతుండటంతో పాటు పట్టణం విస్తరిస్తుండటంతో పాలకులు అవుట్ సోర్సింగ్‌పై కార్మికులను నియమించి నాలుగు డివిజన్‌లు పర్మినెంట్ కార్మికులతో మిగిలిన అయిదు డివిజన్‌లను అవుట్ సోర్సింగ్ కార్మికులతో చేయిస్తు వచ్చారు. కానీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పోస్టలను తొమ్మిది నుంచి నాలుగుకు తగ్గించారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయంలో బర్త్, డెత్ సర్టిఫికెట్‌లను జారీ చేసే హెల్త్ అసిస్టెంట్‌లు నలుగురికి అదనంగా పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలకు వినియోగిస్తు వస్తున్నారు.

నెలకు రూ.50 లక్షల ఖర్చు

సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన తెనాలిలో ఒక హెల్త్ ఆఫీసర్, నలుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, నలుగురు హెల్త్ అసిస్టెంట్‌లు, 82 మంది పర్మినెంట్, 320 అవుట్ సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం 150 పుష్ కాట్‌లు, నాలుగు కాంపాక్టర్‌లు, 13 ట్రాక్టర్‌లు, ఒక చిన్న జేసీబీ ఉంది. వీటితో తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ చేస్తుంటారు. కాల్వలో అయిల్స్ బాల్స్ వేయించటం.. ఫాగింగ్ వంటివీ చేస్తుంటారు. హెల్త్ సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగుల జీతాల కోసం నెలకు సుమారు రూ.30 లక్షలు, వాహనాల అయిల్స్, బ్లీచింగ్ వంటి వాటి కోసం సుమారు రూ.20 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు వినియోగిస్తున్నా ఆశించిన ఫలితాలు రావటం లేదనే విమర్శ పట్టణవాసుల నుంచి ఎక్కువగా వినిపిస్తోంది.

మూలనపడిన 35 ఆటోలు



వెహికల్ షెడ్డులో నిరుపయోగంగా ఉన్న ఆటోలు

స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు తెనాలి మున్సిపాలిటీకి 35 ఆటోలను కొనుగోలు చేసి పంపారు. వాటిలో డ్రైవర్ల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను ప్రవేట్ ఏజన్సీకి అప్పగించారు. అయితే కొద్ది సంవత్సరాలు ఆటోలలో చెత్తసేకరణ జరిపారు. కానీ ఏజన్సీ నిర్వాహకులు డ్రైవర్లకు జీతాలు ఇవ్వకపోవటంతో వారు విధులకు గైర్హాజరు అయ్యారు. ఇంత జరుగుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోకపోవటంతో 35 ఆటోలను గంగానమ్మపేటలోని వెహికల్ షెడ్‌లో ఉంచారు. సుమారు ఏడాది నుంచి అవి మూలన పడి ఉన్నాయి. అధికారులు ఇప్పటికైన స్పందించి వాటిని వినియోగంలోకి తెస్తే చాలా వరకు ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

సచివాలయాల ఏర్పాటు ద్వారా మేలు చేసిన మాజీ సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి శానిటేషన్ సెక్రెటరీలను నియమించారు. దీంతో తెనాలి పట్టణంలోని 47 సచివాలయాలలో 47 మంది శానిటేషన్ సెక్రెటరీలు ఉన్నారు. ప్రస్తుతం వీరితో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు చేయిస్తున్నారు. వీరు కూడా లేకుంటే పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత అస్థవ్యస్థంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి శానిటరి ఇన్‌స్పెక్టర్‌ల పోస్టలు పెంచటంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



సాయంత్రం వరకూ తొలగించని చెత్త

ఇబ్బందులు అధిగమిస్తాం



పారిశుద్ధ్య నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఉన్న మాట వాస్తవం. వాటిని అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. రానున్న రోజుల్లో చెత్త రహిత పట్టణంగా తెనాలిని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. అలాగే ప్రజలకు పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే మాకు తెలియజేస్తే పరిష్కారిస్తాం.

– డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఆరోగ్యాధికారిణి, తెనాలి

పార్కులో సమస్యలు తిష్ట!

- దూరమైన ఆహ్లాదం
- పాడైన లైట్లు
- స్పందించని యంత్రాంగం



సాయంత్రం ఆరు గంటలకే మూసివేసిన మున్సిపల్ పార్కు

తెనాలిఅర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఉన్న మున్సిపల్ పార్కు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ప్రయాణీకులు, స్థానికుల ఆహ్లాదం కోసం దీనిని ఏర్పాటు చేసిన అధికారులు దాని నిర్వహణ బాధ్యతలను విస్మరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతవాసులకు ఆహ్లాదం దూరమవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఉన్న పార్కును గతంలో అధికారులు అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, బెంచీలు, మొక్కలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆ ప్రాంతవాసులు వాకింగ్ చేస్తుంటారు. అలాగే బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణీకులు కూడా పార్కులో సేద తీరుతుంటారు. సుమారు నెలకు పైగా పార్కులు ఏర్పాటు చేసిన వీధిదీపాలు పాడైపోయినాయి. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారుల నుంచి స్పందన కరువైంది. దీంతో సాయంత్రం 6 గంటలకు పార్కును మూసివేస్తున్నారు. దీనివలన సాయంత్రం వేళలో వాకింగ్ చేసుకునే వారు, ఆహ్లాదాన్ని పొందాలనుకునే వారికి అవి దూరమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించిన వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రంగస్థల ప్రముఖుడు 'స్థానం' జయంతి



స్థానం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

తెనాలి: ప్రముఖ రంగస్థల నటుడు, పద్మశ్రీ అవార్డుగ్రహీత స్థానం నరసింహా రావు 122వ జయంతిని సోమవారం తెనాలిలోని సాహితీ, సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. రంగస్థల నటుడిగా ఆయన ప్రాభవాన్ని, నటించిన పాత్రను స్మరించుకున్నారు. బహుళ ప్రజాదరణ పొందిన 'మీరజాలగలడా నా యానతి' అన్న పాటను రచించి, సంగీతాన్ని సమకూర్చింది స్థానం నరసింహా రావేనని స్వరలయవేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించేందుకు స్త్రీలు ముందుకురాని రోజుల్లో స్థానంవారు స్త్రీ పాత్రల్లో రాణించారని వివరించారు. సత్యభామ, చింతామణి, దేవదేవి, మధురవాణి, చిత్రాంగి వంటి పాత్రలను పోషించి ప్రేక్షకుల ఆదరణను పొందారని చెప్పారు. జిల్లా కేంద్రసహకార బ్యాంక్ విశ్రాంత సీఈవో డీవీ సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ నాటకరంగం నుంచి తొలిసారిగా పద్మశ్రీ అందుకున్న నటుడు స్థానం నరసింహారావు అని గుర్తుచేశారు. ఆయన జయంతిని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సంస్థను అభినందించారు. కవి పొన్నపల్లి గోపాల కృష్ణమూర్తి, నటులు హేమంత కుమార్, రమేష్, స్వరలయ సభ్యులు, కళాభిమానులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

తెనాలిరూరల్: పిల్లల అశ్లీల వీడియోలను చూడటం, డౌన్‌లోడ్ చేయడం నేరం కాదన్న తమిళనాడు హైకోర్ట్ ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చడం భారత దేశంలో పిల్లలున్న ప్రతి తల్లి తండ్రి గుండెలమీదున్న కుంపటిని దించడమేనని సినీ దర్శకుడు దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోక్సో చట్ట ప్రకారం పిల్లల పోర్న్ వీడియోలు చూడటం డౌన్‌లోడ్ చేయడం నేరమని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. చెన్నై హైకోర్టు ఇచ్చిన తీర్పుని సవాల్ చేస్తు ఓ తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీనిపై సుప్రీం కోర్టు తీర్పు భారత దేశ ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తు పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్టుందన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

తెనాలిఅర్బన్: అవినీతి రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ విభాగ ఇన్‌చార్జి ఈ.రాంబాబు పేర్కొన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్ఎంహెచ్ స్కూల్‌లో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని, చిన్ననాటి నుంచి అవినీతి వలన జరిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో విజిలెన్స్ ఆఫీసర్ ఎస్‌వీ విజయ్ కుమార్, రీజినల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాస రావు, స్కూల్ హెచ్ఎం సుధారాణి, మేనేజర్‌లు రామాంజనేయులు, సురేష్, అసిస్టెంట్ మేనేజర్ నల్లయ్య, ఎన్‌సీసీ అధికారి పులి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్‌గా ఎ.శ్రీనివాస్‌రెడ్డి

తెనాలిఅర్బన్: మున్సిపల్ ఇంజనీరింగ్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నర్సరావుపేటలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ బదిలీపై తెనాలి వస్తున్నారు. గతంలో ఎంఈగా పనిచేసిన కొడాలి నాగమల్లేశ్వరరావు పదోన్నతి పొంది హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. నూతనంగా నియమితులైన ఎంఈ నాలుగు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

మంత్రి మనోహర్ పర్యటన

తెనాలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని పలు వాణిజ్య ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 12 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. రెవెన్యూకు సంబంధించి ఆరు అర్జీలు, మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై మూడు అర్జీలు రాగా, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 12 అర్జీలు వచ్చాయని తెలిపారు. సంబంధిత ప్రభుత్వ విభాగాలకు పంపి, నిర్ణీత వ్యవధిలోగా అర్జీల పరిష్కారం జరుగుతుందని వివరించారు.

30న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలి: పోస్టల్ రీజినల్ కార్యాలయం, విజయవాడ ఉత్తర్వుల మేరకు ఈనెల 30వ తేదీన తెనాలిలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్టయితే ఆరోజు ఉదయం 11 గంటలకు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. హాజరయ్యేందుకు వీలుపడనివారు తమ ఫిర్యాదుల లేఖలను ఈనెల 27వ తేదీలోగా పోస్టాఫీస్ సూపరింటెండెంట్, తెనాలి డివిజన్, తెనాలి–522 201 చిరునామాకు పంపాలని కోరారు. కవరుపై 'డాక్ అదాలత్' అని రాసి పంపాలని వివరించారు.

కరాటే పోటీల్లో రెండు బంగారు పతకాలు



పతకాలను అందజేస్తున్న కోచ్ నాగరాజు

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో తెనాలిలోని యూనిక్ తైక్వాండో అకాడమి విద్యార్థులకు రెండు బంగారు పతకాలు లభించాయని కోచ్ బట్టు నాగరాజు తెలిపారు. పోటీలను కాకినాడ పీఆర్ డిగ్రీ కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించినట్లు తెలిపారు. అండర్–74 కేజీల విభాగంలో కంభం వినయ్ , అండర్–69 విభాగంలో రాయుడు వీరేంద్ర మంచి ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు చెప్పారు. వీరు డిసెంబర్ 22న కాకినాడలో జరగబోయే నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో పాల్గొనున్నట్లు తెలిపారు. వీరిని సోమవారం అకాడమి ఆవరణలో అభినందించి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమి గౌరవాధ్యక్షుడు అండె బాలచంద్రమౌళి, పలువురు క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుందర తెనాలి కల సాకారం చేసుకుందాం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



25వ వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్

తెనాలిఅర్బన్: సుందర తెనాలి కలను సాకారం చేసుకునేందుకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 4, 12, 25 వార్డులలో సోమవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డులోని ప్రజ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వి.మహా లక్ష్మీపతిరావు, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, కొర్ర యశోద, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మాజీ కౌన్సిలర్లు కుక్కల వాసు, తాడిబోయిన గణేష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి.

నిత్యం వ్యర్థాల మధ్యలో ఎక్కువ సమయం గడిపే పారిశుద్ధ్య కార్మికులందరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాత వైద్యశాల ఆవరణలో సోమవారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. డాక్టర్ బి.సుస్మిత, డాక్టర్ బి.శ్రీకాంత్, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.ఉమామహేశ్వరి, డాక్టర్ పి.విజయకిరణ్, డాక్టర్ ఎం.శ్వేత, డాక్టర్ పి.అంకినీడు, డాక్టర్ మౌనిక కుమార్‌లు పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కూడా అర్హులైన వారికి వేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, బీజేపి నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, వాసుదేవనాయుడు, మైలా హరికృష్ణ, యుగనంద కిషోర్, ఆరోగ్య విస్తరణాధికారి అండె బాలచంద్రమౌళి, పి.రవికుమార్ పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. న్యాయం మరిచారు!

- ప్రభుత్వ హామీ ప్రకారం పసుపు రైతులకు జరగని న్యాయం
- కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద పసుపు రైతుల సంఘం
- తెనాలి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన రైతునేతలు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ అగ్నిప్రమాద ఘటనలో నష్టపోయిన పసుపు రైతులకు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం న్యాయం జరగలేదని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం నాయకులు సోమవారం తెనాలిలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు పసుపు పంట దెబ్బతిని తాము తీవ్రంగా నష్టపోయినట్టు గుర్తుచేశారు. జులై 10న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు సమక్షంలో కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాద బాధిత రైతులకు క్వింటాలుకు రూ.7 వేలు ఇచ్చే విధంగా ఒప్పందం జరిగిందని చెప్పారు. వాస్తవానికి అప్పటికి మార్కెట్లో పసుపు క్వింటాకు రూ.14 వేలు ధర ఉన్నప్పటికీ రూ.7 వేలకే ఒప్పుకున్నట్టు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆ మొత్తాన్ని కూడా ఇంతవరకు రైతుల చేతికి అందకపోవటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు.అగ్నిప్రమాదం, వరదలతో రైతులు అప్పులపాలైనట్టు చెప్పారు. సబ్‌కలెక్టర్ చొరవ చేసి సాధ్యమైనంత త్వరగా పరిహారం డబ్బు ఇప్పించేలా చూడాలని కోరారు.

దీనిపై సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఇన్సూరెన్స్ అధికారులతో సంప్రదించి, అగ్నిబాధిత పసుపు రైతులకు న్యాయం జరిగేలా ప్రయత్నిస్తానని హామీనిచ్చారు. అలాగే రైతులు, కౌలురైతులకు అన్నదాత పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, వరదలతో పంట నష్టపోయిన కౌలు రైతులకు, భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదార్లకు పంట నష్టం అందించాలని రైతునేతలు కోరారు. వరద ప్రభావిత అన్నవరపులంక, బొమ్మువానిపాలెం గ్రామాల్లోని డ్వాక్రా మహిళల రుణాలను రద్దుచేసి, కొత్తగా రూ.లక్ష చొప్పున రుణం ఇవ్వాలన్నారు. రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఆ ప్రకారం వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్‌కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, నాదెళ్ల చంద్రశేఖర్‌రావు, సురేంద్ర, రవి, లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, చందు సత్యనారాయణ, కొడాలి అంజనేయులు, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఐఓసీ డిస్ట్రిబ్యూటర్‌కు సత్కారం



మురళీకృష్ణను సత్కరిస్తున్న అనిల్‌కుమార్

తెనాలి: బెంగళూరులో ఇటీవల జరిగిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల కన్వెన్షన్‌లో తెనాలికి చెందిన డిస్ట్రిబ్యూటర్ మేకా మురళీకృష్ణను సత్కరించారు. గత 25 ఏళ్లుగా డిస్ట్రిబ్యూటర్‌గా కొనసాగుతున్న కారణంగా ఐఓసీ ఈడీ, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల హెడ్ బి.అనిల్‌కుమార్ చేతులమీదుగా ఈ సత్కారం చేశారు. రాష్ట్ర ఎల్‌పీజీ హెడ్ యోగరాణి సురేష్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన సేల్ ఆఫీసర్ కర్రి నల్లారెడ్డి, విజయవాడ, విశాఖ నుంచి దాదాపు 500 మందికిపైగా డిస్ట్రిబ్యూటర్లు, అధికారులు హాజరైనట్టు మురళీకృష్ణ సోమవారం ఇక్కడ తెలియజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

తెనాలిరూరల్: పోలీసు అధికారుల ఆధ్వర్యంలో 'వారధి' కార్యక్రమాన్ని సోమవారం తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా కళాశాలలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జనార్ధనరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఓటీపీ, ఈకేవైసీ ఫ్రాడ్‌లు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై వీడియో రూపంలో విద్యార్థులకు తెలియజేశారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, టూ టౌన్ సీఐ నిస్సార్ బాషా, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు, రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్ కుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

తెనాలిరూరల్: మద్యానికి బానిసై జ్యుయలరీ షాపులో పనిచేసే సేల్స్ మ్యాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంగం జాగర్లమూడికి చెందిన మోదుగుల వెంకటేష్ (32) తెనాలి ఐతానగర్ జెండా చెట్టు రోడ్డులో భార్య, పిల్లలతో కలసి అద్దెకు ఉంటూ ఓ జ్యుయలరీ షాపులో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలి కాలంలో మద్యానికి, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయ్యాడు. ఆదివారం రాత్రి పూటుగా మద్యం తాగి వచ్చి భార్య పిల్లలను కొట్టి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ప్రవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడని చెప్పారు. సమాచారం అందుకునన టూ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, సోమవారం పోస్ట్‌మార్టం జరిపించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల వ్యాపారి..

తెనాలిరూరల్: కుమార్తెను బెదిరించేందుకు ఆత్మహత్యాయత్నం చేసిన పండ్ల వ్యాపారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా (40) మార్కెట్ ఏరియాలో పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. తన కుమార్తె ఓ యువకుడిని ప్రేమిస్తోందని, ఆమెను భయపెట్టాలన్న ఉద్దేశంతో ఆదివారం ఉదయం ఎలుకల మందును మద్యంలో కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో రాత్రికి గుంటూరు వైద్యశాలకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.